క్లుప్తంగా

చర్చి స్థలంపై నోటీసు జారీ



షెడ్డు ముందుభాగంలో అతికించిన నోటీసు

పెనుకొండ: స్థానిక సబ్ కలెక్టర్ బంగ్లా సమీపంలోని చర్చి స్థలంపై గురువారం రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో పట్టణంలోని సర్వేనెంబర్ 194–1కి సంబంధించి కొంత స్థలాన్ని స్థానిక సీఅండ్‌జీ మిషన్ చర్చి ప్రతినిధులు చర్చి అవసరాలకు తమ స్వాధీనంలో ఉంచుకుని చిన్న షెడ్డు నిర్మించారు. సదరు స్థలం పొరంబోకుదని, ఇందుకు సంబంధించి ఏవేని ఆధారాలుంటే కార్యాలయానికి తీసుకురావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నోటీసులో పేర్కొన్నారు. అయితే నోటీసు ఎవరూ తీసుకోకపోవడంతో షెడ్డు ముందుభాగంలో అతికించారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని ఎగువ అచ్చంపల్లిలో గురువారం మడకశిర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ అంజి నేతృత్వంలో మారెమ్మ దేవత ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి పొలంలో నాగేంద్ర కొంత భూమి దానంగా ఇచ్చారన్నారు. దాతలు అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తికి ఏ రూపంలోనైనా సహకారం అందించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజినప్ప, ఉగ్రనరసింహప్ప, నాగరాజు, రవి, రఘు, అంజి, నారాయణప్ప, డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేద్దాం

మడకశిర: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని పార్టీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. పట్టణంలో గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైఎస్ రవిశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఈరలక్కప్ప పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవడమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

మహిళాశక్తి యాప్‌పై అవగాహన

హిందూపురం అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా పోలీసులకు గురువారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద మహిళా శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో యాప్ ఎలా వాడాలనే దానిపై అవగాహన కల్పించారు. పట్టణంలోని వార్డుల్లో ప్రజలకు ఈ యాప్ ప్రయోజనాలు వివరించి యాప్ డౌన్‌లోడ్ చేయించాలని డీఎస్పీ కేవీ మహేష్ సూచించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడితే వెంటనే 1930కు సమాచారం ఇస్తే నగదుకు రక్షణ కల్పించినట్లవుతుందన్నారు. వన్ టౌన్, గ్రామీణ సీఐలు రాజగోపాల్‌నాయుడు, జనార్దన్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


30 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం టౌన్: అక్రమంగా తరలిపోతున్న 30 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య గురువారం తెలిపారు. పట్టణంలోని సూగూరు గేట్ వద్ద ఉదయం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ప్రసాద్ వర్మ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు (30 లీటర్ల మద్యం) తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సీఐ సునంద, ఎస్‌ఐలు సత్యనారాయణ, పృథ్వీ, ఫరూక్, నరసింహ, వెంకటేష్, అంజి, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

సజావుగా బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక కొత్త మున్సిపల్ బస్టాండులోని 22 వాణిజ్య దుకాణాలకు గురువారం మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ నేతృత్వంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 22 దుకాణాల వేలం పాటలు సాగాయి. దాదాపు ఒక్కో దుకాణం రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు పోటా పోటీగా సాగాయి. ఇదివరకే ఆయన ఆధ్వర్యంలో కొత్త మున్సిపల్ బస్టాండులోని 34 దుకాణాలు, పాత బస్టాండులోని 24 దుకాణాలకు వేలం నిర్వహించారు.

ఊరికి దూరం..విడిది కేంద్రం

- ప్రయాణికులకు అక్కరకు రాని షెల్టర్లు
- గ్రామాలకు దూరంగా ఉండడంతో నిరుపయోగం
- వినియోగంలో లేక సామగ్రి దుర్వినియోగం
- పశువుల పాకలుగా మిగిలిన వైనం



మరమ్మతుకు నోచుకోని లక్కేపల్లి బస్టాండ్



బస్ షెల్టర్‌కు అడ్డంగా దుకాణాలు

లేపాక్షి: మారుమూల కేంద్రాలు, గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికుల కోసం నిర్మించిన విడిది కేంద్రాలు ఊరికి దూరంగా ఉన్నాయి. దీనికితోడు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన విడిది కేంద్రాలు వినియోగంలో లేక వాటిలోని బండలు, బల్లలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దిమ్మెలు, ఫ్లోరింగ్ ధ్వంసం చేశారు. ప్రయాణికులకు అనుకూలమైన ప్రాంతాల్లో నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల వ్యాప్తంగా 11 చోట్ల ప్రయాణికుల సౌకర్యార్థం 20 ఏళ్ల క్రితం విడిది కేంద్రాలు నిర్మించారు. అందులో లేపాక్షి, కల్లూరు గ్రామాల్లో ఉన్న షెల్టర్‌లు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మిగిలిన 9 చోట్ల ప్రయాణికుల విడిది కేంద్రాల్లో సిమెంట్ దిమ్మెలు, నల్లబండలు, ఫ్లోరింగ్‌కు వేసిన బండల పరుపును కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఈ షెల్టర్‌లు మేకలు, గొర్రెల, పశువులకు నిలయంగా మారింది. అయితే ఈ విషయంపై అనేకమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేక పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను మరమ్మతు చేయాలని వారు కోరారు.

కొన్నిచోట్ల మాత్రమే వినియోగం..

ప్రయాణికుల కోసం నిర్మించిన విడిది కేంద్రాలు కొన్ని చోట్ల మాత్రమే ఉపయోగంలో ఉంటున్నాయి. మెయిన్ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లులో ప్రయాణికులు విశ్రాంతి తీసుకోవడానికి ప్రభుత్వం బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేసింది. బస్సులు రాకపోకలు ఎక్కువ ఉన్న రహదారులు, మారుమూల ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో బస్‌షెల్టర్లు నిర్మించారు. దీంతో అక్కడ కొంత విశ్రాంతి తీసుకోవడమే కాకుండా బస చేస్తున్నారు. ముఖ్యంగా వేసవిలో ఎండలు ఎక్కువైనప్పుడు, వర్షాలు పడుతున్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతూ వచ్చేవారికి సేదతీరడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

బస్‌షెల్టర్‌లో వేచి ఉండలేం



మా గ్రామం నుంచి హిందూపురం, లేపాక్షి ప్రాంతాలకు వెళ్లడానికి సుమారు 2 కిలో మీటర్ల దూరంలో లక్కేపల్లి బస్‌షెల్టర్ వద్దకు నడిచి వస్తాం. ఆ బస్ షెల్టర్‌లో వేచి ఉండడానికి అవకాశం లేకుండా పోయింది. కూర్చోడానికి వేసిన దిమ్మెలు, ఫ్లోరింగ్ కూడా ధ్వంసమయ్యాయి. మేకలు, గొర్రెలకు షెల్టర్‌గా మారింది.

– ముద్దమ్మ, తిమ్మగానిపల్లి

బస్‌షెల్టర్ మెరుగు పరచాలి



గ్రామంలో ఉన్న ప్రయాణికుల విడది కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలి. ఈ షెల్టర్‌లో సిమెంట్ దిమ్మెలు, నల్లబండలు ధ్వంసం చేశారు. ఈ షెల్టర్‌లో ప్రయాణికులు విడిది చేయాలేక పోతున్నారు. బస్‌షెల్టర్‌కు అడ్డంగా దుకాణాలు ఉండడంతో ప్రయాణికులకు సౌకర్యంగా లేదు.

– మంజునాథ్, శిరివరం

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన



ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మడకశిర: మడకశిర డిపోలో రెండో రోజు గురువారం కూడా ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అక్రమ సస్పెన్షన్లను ఆపాలని, పదోన్నతులను కల్పించడం, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించడం, పాత వైద్య సదుపాయాన్ని పునరుద్ధరించడం తదితర అంశాలపై ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడు రామక్రిష్ణ మాట్లాడుతూ తమ డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు సుబ్బరాయుడు, ముద్దప్ప, పురుషోత్తం, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ మహేష్ పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ నెల 1 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కళాశాలను ప్రారంభించారు. 294 మంది విద్యార్థులకు గాను 50 మంది విద్యార్థులు మాత్రమే కళాశాలకు హాజరయ్యారు.

7 నుంచి అడ్మిషన్లు ప్రారంభం:

ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరడానికి ఈ నెల 7 నుంచి అడ్మిషన్లను ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ మహేష్ తెలిపారు. కళాశాలలో 11 వృత్తి విద్యాకోర్సులు ఉన్నాయన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి హాల్ టికెట్, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులను తీసుకువచ్చి అడ్మిషన్లు పొందాలని ఆయన సూచించారు.

అగళి: మండల కేంద్రంలోని గుప్తా జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్‌లో సైన్స్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రఘురామ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ కోర్సులకు సంబంధించి 7వ తేదీ నుంచి అడ్మిషన్లు చేసుకుంటామన్నారు.

అమరాపురంలో మోస్తరు వర్షం



అమరాపురంలో నిలిచిన వర్షపునీరు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఉరుములు, గాలులతో కూడిన వర్షం పడటడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దాదాపు గంట సేపు చినుకులు పడ్డాయి. ఎండలు అధికంగా ఉండడంతో ఈ వర్షానికి ప్రజలు కాస్తా చల్లబడ్డారు.

చిలమత్తూరులో...

చిలమత్తూరు: మండలంలో పలు చోట్ల గురువారం మోస్తరు వర్షం కురిసింది. చిలమత్తూరు, మరవకొత్తపల్లి, కొత్తచామలపల్లి, పాతచామలపల్లి, కొడికొండ చెక్‌పోస్ట్ , బాగేపల్లి తదితర చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల పదును వర్షం కురిసింది. ఎండవేడిమికి అల్లాడిన ప్రజలకు ఈ వర్షంతో పశమనం లభించింది.

సోమందేపల్లిలో మోస్తరు వర్షం

సోమందేపల్లి: మండలవ్యాప్తంగా గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండే ఎండలతో అవస్థలు పడుతున్న ప్రజలకు వర్షం రాక ఉపశమనం కలిగించింది. దాదాపు అరగంట పాటు వర్షం కురవడంతో రోడ్లపై నీరు పారింది.

వైభవంగా పంచజ్యోతుల ఉత్సవం



భక్తుల మధ్య ఊరేగుతున్న అమ్మవారు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో దేవాంగం, తొగట వీర క్షత్రియ సామాజిక వర్గం ఆరాధ్య దైవమైన చౌడేశ్వరీదేవి పంచ జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రచ్చబండ నుంచి బీహెచ్ మార్గం, పాత తపాలా కార్యాలయం, ఎస్కేపీటి రోడ్డు మీదుగా నూతన చౌడేశ్వరీ దేవాలయం వరకూ వందలాది మంది భక్తుల మధ్య పంచ జ్యోతుల ఉత్సవం ఘనంగా సాగింది. కార్యక్రమంలో వైఎన్ హళ్లి జానపద కళాకారుల కోలాట నృత్యం, సిద్దాపురం కళాకారుల డప్పు వాద్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వేలం వాయిదా

గుడిబండ: మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో గురువారం గుడిబండ పశువుల సంత వేలాన్ని నిర్వహించగా.. ప్రభుత్వం నిర్ధరించిన ధర కంటే తక్కువ పాడగా వేలం వాయిదా వేసినట్లు సర్పంచ్ కరుణాకర్‌గౌడు, ఈఓఆర్డీ నాగరాజునాయక్ తెలిపారు. ప్రభుత్వం పశువుల సంత వేలాన్ని రూ.55 లక్షల నిర్ధారించిందన్నారు. అయితే పీసీ గిరికి చెందిన మంజునాథ్ అనే వ్యక్తి రూ.35 లక్షల వరకు వేలం పాట పాడారు. దీంతో వేలం వాయిదా వేశామన్నారు. తిరిగి వేలం నిర్వహించే తేదీని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

హిందూపురం టౌన్: పట్టణంలోని బాలాజీ థియేటర్ రోడ్డులో ఉన్న రోటరీ క్లబ్ హాలులో ఈనెల 5న ఉచిత కంటి వైద్యశిబిరం ఉంటుందని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు రెడ్డి, శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన బాధితులకు కడప పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు ఉంటాయన్నారు. శుక్లాలకు ఆధునిక ఆపరేషన్, మెల్లకన్ను ఆపరేషన్, రెటీనా, కార్నియా, గ్లూకోమా, టెరీజియం ఆపరేషన్లతోపాటు కంటి ప్లాస్టిక్ సర్జరీ, చిన్నపిల్లల కంటి చికిత్స, కంటి నరాల చికిత్స, కాంటాక్టు లెన్సు, ఇతర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేసిన దృశ్యం

చిలమత్తూరు: మండల పరిధిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఆన్‌లైన్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గురువారం స్థానిక ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ అండ్ టెక్నాలజీ పై నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో విద్యార్థినులు రక్షిత, జ్యోత్స్న, ప్రశాంతి, మూఢనమ్మకాలు, శాస్త్రీయ విజ్ఞాన విభాగంలో వైష్ణవి, జోషిత, హాసిని జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు అలీముల్లా, సురేష్‌కుమార్ విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందించారు.

నిందితుడికి యావజ్జీవం

పావగడ: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు శ్రీరామ్‌కు తుమకూరు ఫోక్సో ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అదే విధంగా రూ.1.50 లక్షల జరిమానా విధించింది. తాలూకాలోని అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి.. 2024లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఓ బాలిక రంగోలి తీసుకు రావడానికి లింగదహళ్లికి వెళ్తుండగా .. అదే మార్గంలో శ్రీరామ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తూ.. బాలికకు మాయమాటలు చెప్పి బైక్‌లో కూర్చోపెట్టుకున్నాడు. కొంచెం దూరం వెళ్లాక దారి మళ్లించి లింగదహళ్లి బయలు ప్రదేశానికి వెళ్లి ఆ బాలికపై అత్యాచారం చేశాడు. ఫిర్యాదు మేరకు నిందితుడు శ్రీరామ్‌ను అరసికెరె పోలీసులు అరెస్ట్ చేసి ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సంఘటనపై విచారణ చేసిన రూరల్ సీఐ గిరీశ్ దోషారోపణలను కోర్టుకు సమర్పించాడు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష (మరణించేంత వరకూ) విధించింది. దీంతో పాటు రూ 1.50 జరిమానా విధించింది. అలాగే బాధిత బాలికకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సమితి నుంచి రూ.8 లక్షలు పరిహారం అందివ్వాలని ఆదేశించింది. ఈ కేసును ప్రభుత్వం తరపున ఏపీపీ హనుమంతరాయ తళికెరి వాదించాడు.

నేడు వేలం

రొళ్ల: స్థానిక సచివాలయం–1 ఆవరణలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రామలక్ష్మమ్మ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ బాబురావు, కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. వారపు సంత , బస్టాండ్ ఆవరణలో సుంకంతో పాటు వివిధ వాహనాల సుంకుం వసూలు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5,000 డిపాజిట్ చెల్లి వేలంలో పాల్గొనాలన్నారు.

ఉష్ణోగ్రత సమాచారం



హిందుపురం	32.0
పెనుకొండ	35.0
మడకశిర	32.0

'అందరి సమక్షంలో హుండీ కానుకలు లెక్కించాలి'

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీలోని కానుకలను అందరి సమక్షంలో లెక్కించాలని ఆలయానికి సంబంధించిన కైవాడస్తులు, గ్రామ పెద్దలు, భక్తులు గురువారం కోరారు. ఈ ఏడాది మార్చి 12 నుంచి 21వ తేదీ వరకూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో హాజరైన భక్తులు కానుకలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అయితే హుండీలోని కానుకలను కొందరి సమక్షంలోనే లెక్కిస్తున్నారు. అలా కారుండా హుండీలోని కానుకలను అందరి సమక్షంలో లెక్కించాలని కై వాడస్తులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుడిబండ: 2025–2026 విద్యా సంవత్సరానికి 6, 11వ తరగతుల్లో మండలంలోని కరికెర కస్తూర్బాగాంధీ (కేజీబీవీ) విద్యాలయంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 70 సీట్లు, 11వ తరగతిలో 70 సీట్లు 7,8,9, తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసినవారు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ దారిద్ర్యరేఖకు దిగువున జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని, వివరాలకు 9704710903 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చిన్నారులకు నూతన వస్త్రాల అందజేత

పరిగి: స్థానిక ఎస్సీ కాలనీలోనిమూడు అంగనవాడీ కేంద్రాల్లోని చిన్నారులకు గురువారం దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను అందించారు. ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు మాట్లాడుతూ తన కుమార్తె దివ్య జ్ఞాపకార్థం ఏటా ఎస్సీ కాలనీలోని అన్ని అంగనవాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'దాసిమయ్య' దార్శనికుడు



దాసిమయ్య జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: దేవాంగ(నేసె) సామాజిక వర్గం ఆరాధ్యదైవమైన బ్రహ్మ దేవర దాసిమయ్య చీకటి నుంచి వెలుగును చూపించిన దార్శనికుడని దేవాంగ సామాజిక వర్గం నేతలు కొనియాడారు. స్థానిక తాలూకా కార్యాలయంలో దాసిమయ్య జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ కుమార్ దాసిమయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, కార్యదర్శి రాజేశ్, వీఏఓ రాఘవేంద్ర, మధుకుమార్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

6న కంటి మెగా వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 6వతేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు షిర్డీసాయిబాబాసేవా సమితి సభ్యులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్య ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పడకేసిన పారిశుధ్యం



కరావులపల్లి గ్రామం మధ్యలో ఉన్న సప్లై చానల్‌లో మురుగునీరు



గోరంట్ల బస్టాండ్ ప్రాంతంలో నెలకొన్న అపరిశుభ్రత

- అపరిశుభ్రతతో అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

గోరంట్ల: మండల కేంద్రంతోపాటు, మండల వ్యాప్తంగా అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మండల పరిధిలోని కరావులపల్లి గ్రామం మధ్యలో చెరువుకు వర్షపునీరు చేరే సప్లై చానల్ ఉంది. సప్లైచానల్‌లోకి అటు ఇటు నిర్మించిన ఇళ్ల నుంచి మురుగునీరు వదులుతున్నారు. దీనికితోడు కొందరు సప్లై చానల్‌ను ఆక్రమించుకున్నారు. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లడంలేదు. మురుగునీటితో దుర్వాసన వెదజల్లుతోంది. సప్లై చానల్ ఆక్రమణకు గురికావడం, స్థానికులు డ్రెయినేజీగా వాడుకుంటుండడంతో అపరిశుభ్రత నెలకొని అనారోగ్యంపాలవుతున్నట్లు స్థానికులు తెలిపారు. సప్లైచానల్‌లో పూడిక తీయడంతోపాటు కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు మండల, జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు కులశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు తెలిపారు.

మేజర్ పంచాయతీలోనూ అపరిశుభ్రత..

మండల కేంద్రమైన గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోనూ పారిశుధ్యం పడకేసింది. స్థానిక పంచాయతీ బస్టాండ్ ఏరియాలో నిత్యం జనసంచారం ఉండే ప్రాంతంలో హోటళ్లు, దుకాణాలలో వెలుబడే వ్యర్థాలు బయలు ప్రదేశంలో పడేయడంతో అపరిశుభ్రత నెలకొంది. దీనికి తోడు సమీపంలో టాయిలెట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బస్సులు నిలిపే ప్రదేశంలో అపరిశుభ్రత నెలకొంది. దుర్వాసనతో భరించలేకపోతున్నామని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు.

సమస్య పరిష్కరించండి



మా గ్రామం మధ్యలో పూర్వం నుంచి చెరువుకు నీరు పోవడానికి పూర్వీకులు సప్లయ్ చానల్ తవ్వారు. అయితే గ్రామంలోని కొందరు సప్లయ్ చానల్‌ను ఆక్రమించారు. దీంతో చెరువుకు నీరు సరిగా చేరడంలేదు. సప్లయ్ చానల్‌లో పూడిక ఉండడం, కొందరు ఇళ్లలోనుంచి మురుగు వదలడంతో అపరిశుభ్రత నెలకొంది. సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

– రేపటి రామచంద్రారెడ్డి, కరావులపల్లి

ప్రతిపాదనలు పంపుతాం

కరావులపల్లి గ్రామంలో చెరువుకు వర్షాపు నీరు చేరే సప్లయ్ చానల్‌ను కొందరు ఆక్రమించుకున్నారు. దీంతో అది పూడిపోవడంతో చెరువుకు నీరు చేరడంలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సప్లయ్ చానల్‌ను సర్వే చేసి ఆక్రమణలు తొలగించడంతో మరమ్మతు చేపట్టడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

– లక్ష్మీనారాయణ, డీఈ, ఇరిగేషన్

6న రాతిదూలం లాగుడు పోటీలు

గోరంట్ల: స్థానిక మరువ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఈనెల 6న వృషభాలతో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. గురువారం నిర్వాహకులు విలేకరులతో మాట్లాడారు. ఆలయ కమిటీ, స్థానిక గోల్డ్‌షాపు యాజమని నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో విజేతలకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో జరిగే ఉట్ల పరుషలో ఉట్ల మాను ఎక్కిన యువకులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9912220726